
ప్రజాశక్తి
సోమవారం 8 ఏప్రిల్ 2024



ఎన్‌డిఎతో రాష్ట్రానికి ముప్పు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్‌డిఎ కూటమితో రాష్ట్రానికి ముప్పు పొంచి ఉందని సిపిఐ రాష్ట్ర నాయకులు గుజ్జుల ఈశ్వరయ్య ఆందోళన వ్యక్తంచేశారు. స్థానిక అమర్ భవన్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అధ్యక్షతన సిపిఐ, కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల బాగోతం వెలుగులోకి వచ్చాక ఆధునిక భారతదేశ చరిత్రలో బిజెపి అత్యంత అవినీతికర పార్టీగా అవతరించిందన్నారు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచి తీరాలని బిజెపి భావిస్తుందని, అందుకోసం ఇడి, సిబిఐ, ఆదాయ పన్ను శాఖ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. బాబు, జగన్, పవన్ వేర్వేరుగా ఉన్నా... బిజెపికి కట్టుబానిసలుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రమేష్‌బాబు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, ఎ.ఆనందరావు, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఎస్.సతీష్, టి.శ్రీనివాసనాయుడు, జి.కూర్మినాయుడు, కె.రాజవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం, సిఐటియు నాయకులను అడ్డుకుంటున్న సిఐ

పోలీసులు అంటే ప్రజలకు రక్షక భటులు... కానీ, శ్రమను దోచుకునే యజమానులకు తొత్తులు కాదు. రక్షక భటులంటే నేరం, హింస, హానికరమైన చర్యలను నివారించడానికి రాజకీయాలకు అతీతంగా, బంధుత్వాలకు భిన్నంగా వ్యవహరించాల్సిన భద్రతా యంత్రాంగం. కానీ, అదే రక్షకభటులు.. దొంగలకు, శ్రమను దోచుకునే వారికి రక్షణగా నిలిస్తే ఏమనాలి? పోలీసులు అతిగా వ్యవహరిస్తున్నారని అనుకోవాలా? లేక రాజకీయ నాయకుల చేతిలో కీలుబొమ్మలుగా మారి స్వతంత్రను కోల్పోతున్నారని భావించాలా? ఇది జిల్లాలో తాజాగా జరుగుతున్న చర్చ ఇది.

- పాలకుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారా?
- లేక ఓవర్ యాక్షన్ చేస్తున్నారా?
- మిమ్స్ ఉద్యోగుల ఆందోళనలో పోలీసుల పాత్రపై విమర్శల వెల్లువ

దొంగల్ని వదిలేసి ఉద్యోగులపై కేసులా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో దొంగతనాలు, దోపిడీలు పెరుగుతున్నాయి. ఇటీవల కాలంలో చెడ్డీగ్యాంగ్‌లు స్వైరవిహారం చేస్తున్నాయి. చింతలవలస ప్రాంతంలో జరిగిన రెండు దొంగతనాల తరువాత చీకటిపడితే శివారు ప్రాంతాల్లోని కుటుంబాలకు కంటిమీద కునుకు ఉండడం లేదు. గంజాయి దిగుమతి, వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. పెద్ద గంజాయి మాఫియానే నడుస్తోంది. అటువంటి రహస్యాలు బయటపడతాయనే భయంతోనే గతేడాది కెఎల్ పురంలోని ఓ యువకుడిని ఓ ముఠా కడతేర్చినట్టు ఆ ప్రాంతవాసులు కథలు కథలుగా చెప్పుకున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీన్ని నివారించేందుకు పోలీసుల సంఖ్య సరిపోవడం లేదంటూ కొంతమంది పోలీసు అధికారుల నోట వినిపిస్తోంది. ఇక కొట్లాటలు, కుటుంబ కలహాల కేసులైతే లెక్కలేదు. వీటిని నివారించడంతోపాటు కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాల్సిన పోలీసులు యాజమాన్యాలకు, శ్రమదోపిడీ చేసిన వారికి కొమ్ముకాస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మిమ్స్ ఉద్యోగుల ఆందోళనలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ఇందుకు తార్కాణమని జనం చెప్పుకుంటున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 67 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇవేవీ గొంతెమ్మ కోర్కెలు కాదు.

2003లో ఏర్పాటైన మిమ్స్ ఆసుపత్రిలో సుమారు వెయ్యి పడకలు ఉన్నాయి. నర్సులు, ఎఎన్‌ఎంలు, ఆయాలు, వార్డు బాయ్స్‌తోపాటు ఎలక్ట్రికల్, పబ్లింగ్, అడ్మినిస్ట్రేషన్, లేబోరేటరీ, సెక్యూరిటీ తదితర విభాగాల్లో సుమారు 400మంది పనిచేస్తున్నారు. 2020లో కోవిడ్ సందర్భంగా ఉద్యోగులు ప్రాణాలకు తెగించి సేవలందించారు. ఓ రకంగా చెప్పాలంటే ఇక్కడి ఉద్యోగుల అంకితభావం.. అటు కాలేజీ, ఇటు బోధనాసుపత్రి ప్రతిష్ట పెంచింది. 2011 ఫిబ్రవరి వరకు సిఐటియు అండతో ఉద్యోగులు చేసిన పోరాటంతో వేతనాల పెంపు, నెలవారీ సెలవులు, డిఎ సదుపాయం, వేతన సవరణకు యాజమాన్యం ముందుకు రాక తప్పలేదు. ఈ క్రమంలోనే 2013, 2015, 2017 సంవత్సరాల్లో క్రమం తప్పకుండా వేతన ఒప్పందాలు జరిగాయి. 2011 అక్టోబర్ నుంచి 2020 అక్టోబర్ వరకు క్రమం తప్పకుండా డిఎ పెరిగింది. ఇందుకు తగ్గట్టే ఉద్యోగులు యాజమాన్యానికి సహకరించారు.

లాభాపేక్షలో పడ్డ యాజమాన్యం 2019లో చేయాల్సిన వేతన ఒప్పందానికి ముందుకు రాలేదు. ఇతర సదుపాయాల విషయంలో మీనమేషాలు లెక్కిస్తూ వచ్చింది. 2021 నుంచి పనిలో చిన్నపాటి పొరపాట్లు జరిగినా జరిమానాలు విధించడం లేదా వేతనాల నుంచి కోత వంటి దుర్మార్గ చర్యలకు దిగింది. చివరికి బలవంతపు అంగీకార లెటర్లు రాయించడం వరకు వెళ్లింది. ఇటీవల కాలంలో వేధింపులు ముమ్మరం చేయడంతోపాటు చిన్నపాటి పొరపాట్లను సాకుగా చూపి పలువురిని సస్పెండ్ చేసింది. దీంతో యాజమాన్యం నిజస్వరూపం తెలుసుకున్న కార్మికులు సిఐటియు నాయకత్వంలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఉద్యోగులంతా ఆందోళనబాట పట్టారు. మిమ్స్ ఆసుపత్రి ముందు నిరసన దీక్షా శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ మొదలుకుని, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, చివరికి కమిషనర్ వరకు ఈ సమస్యను తీసుకెళ్లారు. ఇటు స్థానిక ఎమ్మెల్యే, ఇతర పాలకుల దృష్టిలో కూడా సమస్యను పెట్టారు. అయినా స్పందించకపోవడంతో న్యాయ పోరాటం చేస్తున్న మిమ్స్ ఉద్యోగులకు ఇతర ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. 15 రోజుల క్రితం నెల్లిమర్ల మండలంలోని అన్ని గ్రామాల నుంచీ వందలాది ప్రజానీకం వచ్చి మద్దతు ప్రకటించారు. అయినా పాలకులు, అధికారులు న్యాయం చేయం చేసేందుకు చొరవ చూపలేదు. ఉద్యోగులు మాత్రం తమ ఆందోళన సామరస్యంగానే కొనసాగిస్తున్నారు. వీరి నిరసనలను పోలీసులు శాంతిభద్రత సమస్యగా చూపిస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని జనం చర్చించుకుంటున్నారు.

గడిచిన 67 రోజులుగా శిబిరం వద్ద రోజూ పోలీసులు పహారా కాస్తున్నారు. సుమారు 20 సార్లు ఉద్యోగులు, వారికి అండగా నిలిచిన సిఐటియు నాయకులను అరెస్టులు చేశారు. నిత్యం ఉద్యోగులను వెంబడిస్తూ బూట్ల చప్పుడు, లాఠీల ప్రదర్శనతో భయభ్రాంతులకు గురిచేస్తున్న సంగతి తెలిసిందే. గడిచిన రెండు రోజుల్లో 27 మందిని అరెస్టుచేయగా, 24 మందిని రిమాండ్‌కు కూడా తరలించారు. దీంతో, పోలీసుల చర్యలపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసులు స్వతంత్రను కోల్పోయి, రాజకీయ నాయకుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారని కొందరు, కనీసం ఉద్యోగుల బాధలను కూడా ఆకలింపజేసుకోకుండా కర్కశంగా వ్యవహరిస్తున్నారని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే, ఉద్యోగుల హక్కులను కాలరాయడం మానేసి, వేతనాలు పెంచకుండా, డిఎలు చెల్లించకుండా తిరిగి వేధింపులకు పాల్పడుతున్న మిమ్స్ యాజమాన్యంపై కేసులు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. దొంగల్ని వదిలేసి, శ్రమదోపిడీకి గురౌతున్న వారిని హింసకు, వేధింపులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

మిమ్స్ ఉద్యోగుల అరెస్టు దారుణం

జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి మాధవి



సిఐటియు నాయకులతో మాట్లాడుతున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తమ సమస్యల పరిష్కారం కోసం రెండు నెలలుగా పోరాటం చేస్తున్న మిమ్స్ ఉద్యోగులు, కార్మికులను, వారికి మద్దతుగా నిలిచిన సిఐటియు నాయకులను అరెస్టు చేయడం దారుణమని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, జిల్లా నాయకులు ఎ.జగన్మోహనరావు, బి.రమణ, కె.రామారావు ఆధ్వర్యాన ఆదివారం స్థానిక థామస్‌పేట వద్ద లోకం మాధవి, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్‌ను కలిసి, మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా లోకం మాధవి, కడగల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యానికి అధికార వైసిపి నేతలు తెరవెనుక ఉండి డ్రామాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 300మంది మిమ్స్ ఉద్యోగుల ఆకలి మంటలు ప్రభుత్వానికి పట్టవా? అని మండిపడ్డారు. మహిళలను రాత్రిపూట స్టేషన్లో నిర్బంధించడాన్ని ఖండించారు. జైల్లో ఉన్న కార్మిక కుటుంబాలను పరామర్శించడానికి వచ్చిన సిఐటియు నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం, మహిళలని కొట్టడం వంటి చర్యలు ప్రజాస్వామ్యానికే ప్రమాదమని ఆందోళన వ్యక్తంచేశారు. మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన పోరాటానికి అండగా నిలుస్తామని ప్రకటించారు.

అరెస్టులకు సిపిఎం ఖండన

విజయనగరం టౌన్ : మిమ్స్ ఉద్యోగులను, వారికి అండగా నిలిచిన సిఐటియు నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు ఖండించారు. తక్షణమే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నెల్లిమర్ల : మిమ్స్ ఉద్యోగుల అక్రమ అరెస్టులు దుర్మార్గమని సిఐటియు జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు ఖండించారు. రెండు నెలలకు పైగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మిమ్స్ యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ పోలీసులు శిబిరాన్ని తొలగించడం దారుణమని మండిపడ్డారు.

అరెస్టులపై నిరసన

బొబ్బిలి : అధికార పార్టీ నాయకులు అండదండలతో మిమ్స్ ఉద్యోగులు, కార్మికులను, సిఐటియు నాయకులను అన్యాయంగా అరెస్టులు చేశారని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, నవ్య జ్యూట్ మిల్లు యూనియన్ నాయకులు టి.సత్యారావు, చిరంజీవి ఆగ్రహం వ్యక్తంచేశారు. మిమ్స్ కార్మికులు, ఉద్యోగులు, సిఐటియు నాయకులు అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా నవ్య జ్యూట్ మిల్లు వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి అక్రమ కేసులను రద్దు చేసి అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు

- ఇరుకు గదుల్లో చిన్నారులకు అవస్థలు
- బాలింతలు, గర్భిణులకు పాట్లు
- సాగుతున్న అంగన్వాడీ భవన నిర్మాణాలు



అద్దెభవనంలో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రీస్కూల్ విద్యతోపాటు బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించి సమాజానికి భావితరాలను అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు ఎంతో తోడ్పడుతున్నాయి. అలాంటి అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులు గత కొన్ని నెలలుగా సాగుతున్నాయి. దీంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనాలు, కమ్యూనిటీ హాళ్లలో, పాత పాఠశాల భవనాలలో అంగన్వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాలకు వచ్చేందుకు చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో ఐసిడిఎస్ పరిధిలో విజయనగరం, చీపురుపల్లి, శృంగవరపుకోట, గజపతినగరం, బొబ్బిలి సెక్టార్ల పరిధిలో 2499 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 2480 మంది అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పని చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో 7 నెలల నుంచి మూడేళ్లలోపు ఉన్న చిన్నారులు 44,425 మంది ఉన్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 30,825 మంది ఉన్నారు. 9809 మంది బాలింతలు, 7659 మంది గర్భిణులు ఉన్నారు.

అసౌకర్యాల నెలవు

నేటికీ జిల్లాలోని కొన్ని అంగన్వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించకపోవడం ఆ ప్రాంతాల చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు శాపంగా మారింది. మరుగుదొడ్లు, కిటికీలకు తలుపులు లేకపోవడం కారణంగా వేడి, చలి గాలులకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో సొంత భవనాలు 782 కాగా, 1293 అద్దె భవనాల్లో, 424 అద్దె ఫ్రీ భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో చాలా కేంద్రాలకు సొంత భవనం లేకపోవడం, అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రం నడుస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా 70 అంగన్వాడీ కేంద్రాలకు భవన నిర్మాణ పనులను ప్రభుత్వం చేపట్టింది. నత్తనడకన భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. పూర్తికాకపోవడంతో అద్దె భవనాలు, కమ్యూనిటీ హాలుల్లోను అంగన్వాడీ కేంద్రాలు నిర్వహిస్తుండటంతో కేంద్రాలకు వచ్చేందుకు చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అవస్థలు పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తి చేయడంతోపాటు అన్ని కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని చిన్నారుల తల్లిదండ్రులు, బాలింతలు, గర్భిణులు కోరుతున్నారు.

వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలి



ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అంగన్వాడీ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. కొన్ని కేంద్రాల్లో కనీస సౌకర్యాలు మరుగుదొడ్లు, కిటికీలకు తలుపులు లేవు. దీనివల్ల ఆ ప్రాంతాల అంగన్వాడీల్లో విద్యార్థులు, బాలింతలు, గర్భిణులు అవస్థలు పడుతున్నారు. వసతుల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టాలి.

- వి.లక్ష్మి, జిల్లా గౌరవ అధ్యక్షులు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

నిరంతర విద్యుత్తు సరఫరానే ధ్యేయం

- గ్రామీణ ప్రాంతాలకు త్రీ ఫేస్ కరెంటు పంపిణీ
- 24 గంటల్లో ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు
- 'ప్రజాశక్తి'తో విద్యుత్ శాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు ముఖాముఖి



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'నిరంతర విద్యుత్తు సరఫరా చేయడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం. అధికారులు, సిబ్బందితో వారానికి రెండు దఫాలుగా సమీక్ష చేయడంతో అంతరాయానికి ముకుతాడు వేయగలుగుతున్నాం. గ్రామీణ ప్రాంతాలకు త్రీఫేస్ విద్యుత్తు సరఫరా చేయడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి ఊతమిచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. దీంతోపాటు సంస్థకు ఆదాయాన్ని సమకూర్చడంలో భాగంగా డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించాం. ఫలితంగా బకాయిల భారాన్ని తగ్గించడానికి పాటుపడుతున్నాం. విద్యుత్తు చౌర్యం నిరోధించడంలో భాగంగా తనిఖీలను చేపడుతున్నా'మని విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

జిల్లాలోని విద్యుత్తు సర్వీసులు ఎన్ని? విద్యుత్తు వినియోగం ఎలా ఉంది.?

జిల్లాలోని సబ్‌డివిజన్ల పరిధిలో 9,64,006 విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 7,92,167 గృహ వినియోగ కనెక్షన్లు, 55,552 వ్యవసాయ ,, 90,080 వాణిజ్య, 4847 ఇండస్ట్రియల్, 20,688 వీధి దీపాల కనెక్షన్లు ఉన్నాయి. రోజుకు 11 మిలియన్ యూనిట్ల సాధారణ వినియోగం ఉంటుంది. ప్రస్తుతం 10 -12 మిలియన్ యూనిట్ల వరకు రోజు వారి వినియోగం ఉంటోంది. 2023 ఫిబ్రవరిలో 508 మిలియన్ యూనిట్లు ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 591, మార్చి 508 మిలియన్ యూనిట్లు వినియోగం ఉంది.

ట్రాన్స్ ఫార్మర్లు లభ్యత ఎలా ఉంది.?

జిల్లాలో 31162 ట్రాన్స్ ఫార్మర్లున్నాయి. ఇందులో త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు 23073, సింగిల్ ఫేస్ ట్రాన్స్ ఫార్మర్లు 8089 వరకు ఉన్నాయి.

నూతన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారా.?

కొత్తగా 4 సబ్ స్టేషన్లు (33కెవి) మంజూరయ్యాయి. గుంకలాం, పుర్రేయవలస, రామన్నదొరవలస, గుమడాం, వెదుల్లవలస సబ్ స్టేషన్లు నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చాం.



అంతరాయాల నివారణకు తీసుకున్న చర్యలు.?

24x7 నాణ్యమైన విద్యుత్తు సరఫరా, అంతరాయాల నివారణపై దృష్టిసారించాం. 33 కెవి, 11 కెవి, ఎల్‌టి విద్యుత్ లైన్లలో ఏర్పడే సాంకేతిక లోపాలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా సరిచేస్తున్నాం. దీని ద్వారా ట్రిప్పింగ్స్‌ను తగ్గించగలిగాం.

వేసవి తీవ్రత దృష్ట్యా విద్యుత్తు అంతరాయం లేకుండా చేపట్టిన జాగ్రత్తలు ఏమిటి.?

ప్రస్తుతం విద్యుత్తు వినియోగం 11 మిలియన్ యూనిట్లు ఉంది. ఇది కాస్తా 13 మిలియన్ యూనిట్లకు పెరిగే అవకాశం ఉంది. అందుకనుగుణంగా అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేసే విధంగా ముందస్తు చర్యలు తీసుకున్నాం.

వినియోగదారులకు విద్యుత్తు వినియోగంపై మీరిచ్చే సందేశం ఏమిటి.?

వేసవి నేపథ్యంలో సాధారణ వాడకం కంటే ఒకట్రెండు మిలియన్ యూనిట్లు అధికంగా వినియోగమయ్యే అవకాశం ఉంది. వినియోగదారులు విద్యుత్తు వినియోగం వృథా చేయకుండా పొదుపుగా వాడితే ఎటువంటి ఇబ్బందులూ రావు. ముఖ్యంగా ఎసిల వినియోగం పెరిగే అవకాశముంది. ఎసి వినియోగదారులు 26 డిగ్రీల వద్ద ఉంచి, ఫ్యాన్ 1లో ఉంచుకుంటే విద్యుత్తు వినియోగం ఎక్కువ కాకుండా ఆదా కావడంతోపాటు బిల్లు తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. వినియోగదారులు విద్యుత్తు పొదుపు చర్యలు పాటించి సహకరించాలి.

విద్యుత్తు అంతరాయం వస్తే తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

విద్యుత్తు అంతరాయం, ఎటువంటి ఇబ్బందులు వచ్చినా మండలాల్లో ఉన్న ఎఇలకు ఫోన్ చేసి తెలియజేయాలి. విద్యుత్తు శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేయాలి. దీంతోపాటు ఆయా సబ్ డివిజన్లలో ఉన్న డిఇలు.. విజయనగరం టౌన్ -1 డిఇఇ-9440812455, టౌన్ -2 డిఇఇ-9440812457, చీపురుపల్లి డిఇఇ-9440812397, భోగాపురం డిఇఇ-7382585683, గజపతినగరం డిఇఇ-9491049812, ఎస్.కోట డిఇఇ-9440812458, బొబ్బిలి టౌన్ డిఇఇ-9440812459, బొబ్బిలి రూరల్ డిఇఇ-7382585684, సాలూరు డిఇఇ- 9440812461, పార్వతీపురం డిఇఇ-9440812460, పార్వతీపురం ఐటిడిఎ డిఇఇ- 9440812462, రాజాం డిఇఇ-9440812396 నంబర్లను సంప్రదించాలి.

ఆ కుటుంబాల వల్లే

ఉత్తరాంధ్ర వెనుకబాటు

పల్సస్ సిఇఒ గేదెల శ్రీనుబాబు



పల్సస్ సిఇఒ గేదెల శ్రీనుబాబు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉత్తరాంధ్ర జిల్లాల వెనుకబాటుకు, ఈ ప్రాంత ప్రజలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస పోవడానికి మూడు కుటుంబాలే కారణమని పల్సస్ సిఇఒ గేదెల శ్రీనుబాబు అన్నారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో మూడు కుటుంబాలు అభివృద్ధి చెందుతున్నాయే తప్ప ఇతరులెవరూ వృద్ధిలోకి రావడం లేదని చెప్పారు. ఆ కుటుంబాల కారణంగా లక్షలాది మంది ఉత్తరాంధ్ర ప్రజలు ఇతర ప్రాంతాలకు భవన నిర్మాణ కార్మికులుగా, సెక్యూరిటీ గార్డులుగా వలస పోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో స్థానికులను కాదని వలస నాయకులను ప్రోత్సహించడం సమంజసం కాదన్నారు. వలస నాయకుల కారణంగా స్థానిక నాయకులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి, తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధే ధ్యేయంగా పల్సస్ సంస్థ పనిచేస్తుందని, ఇప్పటివరకు సంస్థ ద్వారా ఈ ప్రాంతంలో 5 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యావరణానికి నష్టం కలిగించని పరిశ్రమలను స్థాపించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా పల్సస్ సంస్థ కృషి చేస్తుందని చెప్పారు. జిల్లాలో వ్యవసాయ ఆధార పరిశ్రమలు స్థాపించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో తూర్పు కాపు సామాజిక వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు మజ్జి అప్పారావు, జిల్లా అధ్యక్షులు రొంగలి రామారావు, టి.వెంకటరమణ, ముదిలి నాగభూషణం, తాత్రాజు రాజారావు, బొత్స శ్రీను, రుషికేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యం మనందరి బాధ్యత

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆరోగ్యం మన అందరి బాధ్యతని డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ర్యాలీని ఆయన జెండా ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి కె.రాణి, డిఐఒ అజయ్ కుమార్, వి.చిన్నతల్లి, బి.మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషిచేయాలి

విజయనగరం టౌన్ : ప్రజారోగ్య పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ఇప్పటికైనా నిధులు వెచ్చించి ప్రభుత్వ వైద్యాన్ని అభివృద్ధి చేయాలని ఎపిఎంఎస్‌ఆర్‌యు జిల్లా కార్యదర్శి భగవాన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసా, జెవివి సమతా విభాగం రాష్ట్ర కన్వీనర్ నిర్మలా, ప్రజారోగ్య పరిరక్షణ వేదిక నాయకులు లక్ష్మణరావు డిమాండ్‌చేశారు. ప్రపంచ ప్రజారోగ్య దినం సందర్భంగా ఆదివారం కోట వద్ద నిరసన, ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎంఎస్‌ఆర్‌యు నాయకులు మూర్తి, శశిధర్, ప్రసాద్ పాల్గొన్నారు.




జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

జగన్ ఇచ్చిన పదవి తీసుకుని

వేరే పార్టీకి పనిచేస్తున్నారు

ఎమ్మెల్సీ రఘురాజుపై మంత్రి బొత్స ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వైసిపిలో సిఎం జగన్ ఇచ్చిన పదవులను తీసుకుని వేరే పార్టీకి పనిచేస్తున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ.. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. అటువంటి వారు స్వలాభం కోసమే గాని ప్రజా క్షేమం కోసం పనిచేయరని ధ్వజమెత్తారు. అటువంటి వారిని లెక్కచేయనవసరం లేదని తేల్చిచెప్పారు. పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని మాటిచ్చారు. ఆదివారం పట్టణంలోని శిరికి రిసార్ట్స్‌లో వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్ అధ్యక్షతన జరిగిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలోనే ప్రజలు గౌరవంగా బతకగలరని తెలిపారు. పింఛన్ల పంపిణీ విషయంలో వాలంటీర్లపై ఇసికి ఫిర్యాదు చేసి, వైసిపిపై బురద చల్లాలని టిడిపి చూస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. గృహసారథులంతా ఎన్నికల్లో చురుకుగా పనిచేసి మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ. ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జిసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామునాయుడు, కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎఎంసి చైర్‌పర్సన్ మూకల కస్తూరి, రాష్ట్ర ఫోక్, కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, జెడ్‌పిటిసిలు ఎం.వెంకటలక్ష్మి, శానాపతి అప్పారావు, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

ఎండ మంట కడుపు మంట

- పనిచేసే చోట కానరాని సౌకర్యాలు
- ఎండలో మండిపోతున్నా పట్టించుకోని వైనం
- మరోపక్క నెల రోజులుగా అందని వేతనాలు
- ఇబ్బందుల్లో ఉపాధి కూలీలు


రేగిడి: ఎండలోనే పనులు చేస్తున్న వేతనదారులు

ప్రజాశక్తి- రేగిడి

గత వారం రోజులుగా ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో ప్రజలు బయట తిరిగేందుకే భయపడుతన్నారు. అలాంటి పరిస్థితిని ఎదురించి ఉపాధి కోసం కూలీలు మండే ఎండలో పనిచేస్తున్నా వారికి కనీస నీడ సౌకర్యం కల్పించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో ఎండలో మండిపోతూ పనులు చేస్తున్నారు. మరోపక్క ఇంత ఎండలో కష్టపడి పనిచేసినప్పటికీ గత నెల రోజులుగా కూలీలకు వేతనాలు ఇవ్వకపోవడంతో కడుపు మండి అల్లాడిపోతున్నారు. ఒక పక్క ఎండ మంట మరోపక్క కడుపు మంటతో కూలీలు అవస్థలు పడుతున్నారు.

మండలంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో వేతనదారులు ఎటువంటి సౌకర్యాలూ లేక మండుటెండల్లోనే పనులు చేస్తున్నారు. కనీసం పనులు వద్ద నీడ, తాగునీరు, ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనలకు ప్రథమ చికిత్స కిట్లు లేక పోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారు. పనుల వద్ద కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఎండలకు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని, జరగరాని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని ఉపాధి హామీ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కొన్నిచోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే స్వచ్ఛందంగా కమ్మ షెడ్లు ఏర్పాటు చేసి వేతనదారులకు కొంతమేరకు నీడను కల్పిస్తున్నారు.

జిల్లాలో 2018 సంవత్సరానికి మాత్రమే ఉపాధి కూలీల పనులు వద్ద నీడ కోసం పరదాలు అందజేశారు. ఆ పరదాలు కొన్ని సంవత్సరాలు తరువాత చిరిగిపోయి పాడైపోయాయి. ఆ తరువాత పనుల వద్ద నీడ కోసం ఎటువంటి పరదాలూ పంపిణీ చేయలేదు. కానీ 2021- 22 ఏడాదికి పరదాలు అందినట్లు ఉపిడిలు చెప్పడం కొసమెరుపు..

మండలంలో 39 గ్రామపంచాయతీలో 16,715 జాబ్ కార్డులున్నాయి. ఇందులో 2వేల మంది ఇళ్ల నిర్మాణ వేతనదారులు జాబ్‌కార్డులు పోగా, మరో 2వేలు కార్డులను వంద రోజులు పని పూర్తి చేసిన సందర్భంగా తొలగించారు. ప్రస్తుతం 12,060 జాబ్ కార్డులతో పనులు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.25.95 కోట్లు పనులకు ఆమోదం లభించింది. ఇప్పటికే పనులు ప్రారంభించారు. వీటికి ఫిబ్రవరి 29 నాటికి బిల్లులు వేతనదారులకు చెల్లించినట్లు చెబుతున్నప్పటికీ ఏప్రిల్ 7 వరకు 38 రోజులకు గాను 15 లక్షల మంది వేతనదారులకు పైసా కూడా ఖాతాలో జమ చేయలేదు. దీంతో వేతనదారులు నగదు ఖాతాలో జమ కాక నిత్యవసర సరుకులు కొనుగోలు చేయలేక ఆకలి బాధతో అలమటిస్తున్నారు. ఉపాధి సిబ్బంది పేమెంట్ రికార్డు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి వేతనదారులకు కూలి డబ్బులు రాలేదని చెబుతున్నారు.

కూలి డబ్బులు రాక ఇబ్బందులు



ఉపాధి హామీ పథకంలో పనులు చేసినప్పటికీ 37 రోజుల నుంచి కూలి డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నాం. ప్రతిరోజు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నాం. కానీ కూలి డబ్బులు రాలేదని బ్యాంకర్లు చెబుతున్నారు. పిల్లాపాపలతో కుటుంబాన్ని ఎలా నెట్టుకు రాగలం. ప్రభుత్వాలు తక్షణమే ఉపాధి కూలీ డబ్బులు ఖాతాలో జమ చేయాలి.

ఏ. సత్యం, సంకిలి.

పనుల వద్ద సౌకర్యాలు లేవు



గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు వద్ద నీడ లేక ఎండలో పనులు చేస్తున్నాం. పనులు వద్ద తాగునీరు, నీడ కోసం పరదాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రథమ చికిత్స కిట్లు కూడా లేని పరిస్థితి. జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు.

బొత్స సూర్యడమ్మ, కూలీ

పని వేళలు మార్చాం

గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులకు ఎండలు తీవ్రత కారణంగా సమయాలు మార్చాం. ఉదయం 6 గంటల నుంచి 10 గంటలు వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి 6 గంటల వరకు చేయాలని ఆదేశించాం. పనులు వద్ద సౌకర్యాలు లేకపోవడం వాస్తవం. ప్రత్యామ్నాయంగా ఎండలు తీవ్రత కారణంగా కమ్మ షెడ్లు ఏర్పాటు చేయమని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశించాం.

శ్రీనివాసరావు.. ఏపీడి. రాజాం క్లస్టర్.

తాటాకు టెంట్లే దిక్కు

వేపాడ: మండలంలో పలు గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులు వద్ద ఎటువంటి సౌకర్యాలూ లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. పనిచేసే చోట నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలి, తాగునీటి సౌకర్యం కల్పించాలి, మెడికల్ కిట్లు కూడా సమకూర్చి ఉంచాలి కానీ ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదు. కొన్ని చోట్ల చిరిగిపోయిన పరదాలను వేస్తున్నారని వాటి వల్ల ఉపయోగం లేదని మరికొన్ని చోట్ల అసలు చిరిగిన టెంట్లు కూడా లేవని వేతనదారులు చెబుతున్నారు.

తాటాకులతో తాత్కాలిక టెంట్లు



పరదాలు లేని చోట ప్రత్యేక శ్రద్ధతో తాటాకుల టెంట్లు వేయిస్తున్నాం. మట్టికుండలో తాగునీరు ఏర్పాటు చేస్తునాం. ప్రథమ చికిత్స కోసం కిట్లును కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వం టెంట్లు ఇచ్చి చాలా కాలమైన విషయం తెలిసిందే. చాలా గ్రామాల్లో పరదాలు సగానికిపైగా చిరిగిపోయాయి. దీంతో నా సొంత నిధులతో ఉపాధి హామీ వేతనదారులు పనిచేసే చోట తాటాకులతో నీడ కల్పించే ఏర్పాట్లు చేస్తున్నాను.

ఆదిలక్ష్మి ఎపిఒ, వేపాడ


వేపాడ: ఎండలోనే పని చేస్తున్న కూలీలు, (ఇన్‌సర్ట్‌లో) తాటాకులతో వేసిన టెంట్లు

బిసిలకు అండగా టిడిపి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని డొంకినవలస గ్రామంలో జయహో బీసీ సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కొప్పల వెలమ బీసీ సాధికార కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు, మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, రాష్ట్ర ఎస్‌టి జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు మాట్లాడుతూ బీసీలకు అండగా ఎప్పుడూ టిడిపి ఉంటుందన్నారు. ప్రతీ నెలా మొదటి రోజున పింఛన్ 4వేలు రూపాయలు ఇంటికి వచ్చి అందజేస్తామన్నారు. అనంతరం టిడిపి ప్రచార నిర్వహించి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శంబంగికి ఓటు అడిగే అర్హత లేదు

ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుకు ఓటు అడిగే అర్హత లేదని బీసీ సాధికార కన్వీనర్ కొల్లి అప్పల నాయుడు ఆదివారం అన్నారు. ఎమ్మెల్యే వల్ల నియోజకవర్గానికి, బాడంగి మండలానికి ఏటువంటి ఉపయోగం లేదని చెప్పారు. ముఖ్యంగా కోడూరు గ్రామానికి ఆయన ఏమీ చేయలేదన్నారు. బేబినాయన లేకపోతే తన సొంత నిధులతో గ్రామానికి కల్వర్టు నిర్మించారని గుర్తు చేశారు.

శతశాతం పోలింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి- నెల్లిమర్ల

సార్వత్రిక ఎన్నికల్లో శాతం పోలింగ్‌పై అధికార్లు అవగాహన కల్పించారు. ఆదివారం స్థానిక థామస్ పేట ఫుట్ బాల్ గ్రౌండ్ లో స్వీప్ కార్యక్రమం నిర్వహణలో భాగంగా ప్రజలను ఎక్కువ శాతం పోలింగ్‌లో పాల్గొనే విధంగా అవగాహన కల్పించడానికి వాకర్స్‌కు ఓటు నమోదు, వినియోగం గురించి తహశీల్దార్ డి. ధర్మరాజు, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ వివిఎస్ ఎన్ మూర్తి, స్వీప్ నోడల్ అధికారి సూర్యకాంతం ర్యాలీ చేపట్టారు. వాకింగ్‌లో పాల్గొన్న వాకర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ డి ధర్మరాజు మాట్లాడుతూ నమోదైన ఓటర్లందరూ 100శాతం ఓటింగ్‌లో పాల్గొని ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరారు. ఎన్నికల డిటి మాట్లాడుతూ 1950 టోల్ ఫ్రీ నెంబర్ ఉపయోగించుకుని తమ ఓటు ఓటర్ లిస్ట్ లో ఉన్నదా లేదా అనే విషయాన్ని ముందుగా పరిశీలించుకుని లేకపోతే వాటర్ హెల్ప్ లైన్ ద్వారా ఈనెల 15లోగా ఓటర్‌గా నమోదు చేసుకోవాలని కోరారు.

'అవినీతి రహిత పాలన అందించాం'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అవినీతి రహిత పాలన అందించామని, మరోసారి తమకు అవకాశం కల్పించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. నగరంలోని గాజులరేగ ప్రాంతంలో ఇంటింటి ప్రచారంలో కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రజా సంక్షేమ పాలన అందించిన వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజలంతా మరోసారి దీవెనలు అందించాలని కోలగట్ల కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని మాటిచ్చారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, వైసిపి నాయకులు కనుగుల రాజు, కార్పొరేటర్లు నడిపిల్లి ఆదినారాయణ, పట్నా ఆదిలక్ష్మి, వైసిపి నాయకులు మన్యాల కృష్ణ, జమ్మ మధు, జామాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసేవారికి ఓటేయండి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, అభివృద్ధి ఎవరు చేస్తారో వారికే ఓటేయాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు యువతకు సూచించారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో యువతతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మొదటి సారిగా ఓటు హక్కు వినియోగించుకోబోతున్న యువత ఓటు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటుందన్నారు. దాన్ని సరైన మార్గంలో వినియోగించుకోవాలన్నారు. ఓటును అమ్ముకోవద్దని, దానిని నమ్ముకుని మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునే రాజమార్గమని అన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, బిసి సెల్ నాయకులు వేచలపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని జగన్నాథపురంలో గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేయడంతో 20 గొర్రె పిల్లలు మృతి చెందాయి. ఈ గ్రామానికి చెందిన దేవర సత్యం గొర్రె పిల్లల మందలపాక నుంచి మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి వెళ్లాడు. ఎవరూ లేని సమయంలో కుక్కలు ఒక్కసారిగా గొర్రె పిల్లలు ఉంచిన పాకలోనికి వెళ్లి గొర్రె పిల్లలపై దాడి చేసి 20 పిల్లను చంపేశాయి. స్థానికలు గుర్తించి మంద వద్దకు చేరుకునే సరికి కుక్కలు అక్కడి నుంచి పారిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఒకేసారి ఇన్ని గొర్రె పిల్లలు చనిపోవడంతో యజమాని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల జనసేన పార్టీ నాయకులు సబ్బవరపు రాజశేఖర్ అక్కడకు చేరుకుని రూ. 10వేలు ఆర్థికి సాయం అందించారు.

ఇసుక అక్రమ రవాణాపై కొరడా

ప్రజాశక్తి- బొబ్బిలి

ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. మండలంలోని అలజంగి వేగావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి, విఆర్ఒ సుధాకర్ పట్టుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ మండలంలో ఇసుక తవ్వకాలకు ఎక్కడా అనుమతులు ఇవ్వలేదన్నారు. ఇసుక అక్రమంగా తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఇసుక అక్రమ రవాణా నివారణకు సహకరించాలని కోరారు.

51 మద్యం సీసాలు సీజ్

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని గొల్లాది గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై ఎస్ఇబి పోలీసులు దాడి చేసి 51 మద్యం సీసాలను సీజ్ చేసి వ్యాపారి జి.అప్పలనాయుడును అరెస్టు చేశారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐలు ఎస్‌వి రామారావు, ఎల్.తిరుపతిరావు, సిబ్బందితో దాడి చేసినట్లు సిఐ బివి మురళీధర్ చెప్పారు. పట్టణ, గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పిల్లల ఆచూకీ తెలపండి

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని గర్భాం గ్రామానికి చెందిన జాఫర్‌ఖాన్ కుమారులు షేక్ ఫరిద్ కషన్(12), షేక్ ఉమీర్ ఖాన్(9) శనివారం సాయంత్రం నుండి కనిపించటం లేదని జాఫర్‌ఖాన్ బుధరాయవలస పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి ఇప్పటికే దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు. శనివారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తరువాత నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

3వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని దేవునికనపాకలో నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు గుర్ల ఎస్ఐ భాస్కర్ రావు తెలిపారు. ఆదివారం నిర్వహించిన దాడులలో 25 లీటర్ల నాటుసారా, 3వేల లీటర్లు బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. గ్రామ పరిసరాలలో తనిఖీలలో భాగంగా వాటిని గుర్తించామన్నారు. అక్రంగా మద్యం అమ్మకాలు చేసినా, నాటుసారా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్తవలస: మండలంలోని దేవాడ గ్రామ శివార్లలో ఎస్ఐ సుదర్శన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించి మామిడితోట భూమిలో దాచిన 1000 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసంచేశారు.

15 ఎకరాల తోట దగ్ధం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రానికి చెందిన ఆదపరెడ్డి అప్పారావు, నాగిరెడ్డి అచ్చి అమ్మ, నాగిరెడ్డి నారాయణ, ఎన్ అప్పలనాయుడు, ఎన్ మురళి, ఆంద్రపు అప్పారావు, మల్లు నాడులకు చెందిన 15 ఎకరాలు విస్తీర్ణంలో టేకు, సరుగుడు, జామ, మామిడి తోటలు ఆదివారం దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. అయితే అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో తెలియాల్సి ఉంది.

బొత్స ఇలాకాలో భారీ కుదుపు

- పార్టీ మారనున్న వైసిపి పెద్దలు
- పట్టించుకోని జెడ్‌పి చైర్మన్?

ప్రజాశక్తి- మెరకముడిదాం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇలాకాలో లుకలుకలు బయటపడుతున్నాయి. ఇవి రాబోయే ఎన్నికలలో ముదిరి తారాస్థాయికి చేరుకోవటానికి అవకాశముందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఈ నియోజకవర్గంలో టిడిపిలోకి చేరికలు పెరగడం వైసిపిలో పెద్ద కుదుపు మొదలైంది. ప్రతి ఎన్నికలో బొత్స సత్యనారాయణను చీపురుపల్లి, గరివిడి, గుర్ల మండలాల్లో కంటే అత్యధిక మెజారిటీతో గెలిపించి మంత్రిగా చేయడంలో కీలక పాత్ర పోసించిన మెరకముడిదాం మండలంలో కొంత మంది పార్టీ మారడం చర్చనీయాంశమవుతోంది. దీంతో వచ్చే ఎన్నికల్లో వైసిపి కంచుకోటకు బీటలు వారే ప్రమాదం ఉందని చర్చించుకుంటున్నారు. చిన బంటుపల్లి పంచాయతీకి చెందిన మాజీ ఎంపిపి కోట్ల మోతిలాల్ నాయుడును టిడిపి నాయకులు కళా వెంకటరావు కలవడం ఈ వాదనకు బలం చేకూర్చుతుంది. త్వరలో ఆయన టిడిపి తీర్థం పుచ్చుకుంటారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. మండలంలో మోతిలాల్ నాయుడుకు కొన్ని పంచాయతీల్లో క్యాడర్ ఉంది. ఓటమి అంచుల్లో ఉన్న వాళ్ళని కూడా గెలుపుంచుకొనే సత్తా ఉంది. అటువంటి వ్యక్తిని చీపురుపల్లి కూటమి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు, గద్దె బాబురావు, జనసేన నాయకులు


మోతీలాల్ నాయుడును కలిసిన కళా వెంకటరావు(ఫైల్)

కలిసి తమ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. దీంతో మోతిలాల్ నాయుడు ఈ నెల 10న సైకిల్ ఎక్కడానికి ముహూర్తం పెట్టుకున్నట్లు తెలిస్తోంది. గర్భాం గ్రామానికి చెందిన కీర్తి శేషులు మాజీ ఎంపిపి తాడ్డి కృష్ణారావు కుమారుడు తాడ్డి చంద్రశేఖర్ కూడా టిడిపిలోకి చేరటానికి తన వర్గాన్ని సిద్ధం చేసుకున్నారు. చంద్రశేఖర్‌ని కూడా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కళా వెంకటరావు కలిశారు.

ఏకాగ్రీవం ఏమైంది..

వాస్తవానికి మెరకముడిదాం మండలం వైసిపికి కంచుకోట. ఈ మండలం నుంచి జెడ్‌పిటిసిగా బరిలో దిగి ఏకాగ్రీవంగా ఎన్నికైన జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు ఇక్కడ మంచి పట్టే ఉంది. అటువంటి మండలంలో టిడిపిలో చేరికలు జీర్ణించుకోలేక పోతున్నారు. ఎంత మంది మారినా జెడ్‌పి చైర్మన్ మౌనంగానే ఉన్నారని తెలిస్తోంది. దీంతో వలసలు మరింత పెరిగి వైసిపి కోటకు బీటలు వారినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ మండలంపై మంత్రి బొత్సకు కూడా మంచి పట్టే ఉంది. ఎవరినైనా పేరు పెట్టి పిలిచి ఆకట్టుకునే మనస్తత్వం కలిగిన మంత్రి బొత్స సమయం లేక ఇక్కడ దృష్టి పెట్టలేకపోతున్నారన్న వాదన వినిపిస్తోంది. ఆయన దృష్టిపెట్టకపోవడం, ఇక్కడ ఉన్న నాయకులు పార్టీని పట్టించుకోకపోవడంతో వలసలు పెరిగి వైసిపికి కష్టాలు ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అందరినీ కలుపుకుని వెళ్లే పరిస్థితి స్థానిక నాయకత్వంలో కనిపించడం లేదు. ఇప్పటికైనా మంత్రి బొత్స, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మండలంలో పాటు నియోజకవర్గంపై దృష్టి సారించకపోతే ఈ సారి మంత్రి విజయం అంత సులువు కాదన్న చర్చ జోరుగా సాగుతోంది.

నవ్వుతో గుండెకు ఆరోగ్యం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నవ్వుతో గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చునని న్యాయవాది వ్యవస్థాపకులు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. విశాఖపట్నం వి డెంటల్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన స్మైల్ కాంటెస్ట్‌లో ఎస్‌కోట పట్టణానికి చెందిన న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ (46 విభాగం), చరిత్ర అధ్యాపకులు వై.విజయలక్ష్మి (26-45 విభాగం), చిన్నారులు బి.హృషీకేష్, బి.లాస్య శ్రీ (7-15 విభాగం) ఎంపికై బెస్ట్ స్మైల్ - 2024 అవార్డులను అందుకున్నారు. వీరందరూ ఒకే కుటుంబానికి చెందినవారు కావడం విశేషం. మొత్తం 1439 మంది పోటీలో నిలవగా 87 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బి.రామకృష్ణ మాట్లాడుతూ మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు నవ్వు నూరు శాతం సహజంగా ఉంటుందని, నిర్మలమైన మనసుతో హాయిగా నవ్వుదాం, ఆందోళనలను వదలి గుండె ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడు కుందాం అని అన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన ఈ వేడుకలలో జాతీయ హిందీ పరిషత్ అధ్యక్షుడు పద్మభూషణ్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ యమ్. జేమ్స్ స్టీఫెన్, ఎదయ్ పాల్గొన్నారు.

ఎరుకొండలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

బకెట్లు పంచి ప్రజలను వంచించి ఓట్లు రాబట్టుకోవాలనే రాజకీయ నేతలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని ఎరుకొండ పంచాయతీ పరిధిలో వైసిపి ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ సందర్భగా ఆయన ఇంటింటింటికి తిరిగి సంక్షేమ పథకాలు ఇస్తున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా, ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. డొక్కులు పంచిన అభ్యర్థి కుల రాజకీయాలు చేయాలని చూస్తుందన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని సంక్షేమం అందించే ప్రభుత్వానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో ఎంపిపి మహంతి కళ్యాణి, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపిలు అల్లాడ రమేష్, ఎన్. సత్యనారాయణ రాజు, నాయకులు మహంతి జనార్ధనరావు, పుప్పాల లక్ష్మినారాయణ, పసుపాం, ఎరుకొండ నాయకులు వాళ్లె ఆధినారాయణ, అచ్చెం నాయుడు, శాంతాటి శ్రీనువాసరావు, రమణ పాల్గొన్నారు.

వైసిపి ఇంటింట ప్రచారం

వేపాడ: మండలంలోని సింగరాయలో వైసిపి నాయకులు ఆదివారం సాయంత్రం ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్


పూసపాటిరేగ: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

రామనాయుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

మరో అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తా

తెర్లాం: మరోసారి ఎమ్మెల్యేగా తనకు అవకాశమిస్తే మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన ప్పలనాయుడు అన్నారు. మండలంలోని లోచర్ల, తెర్లాం మండల కేంద్రంలో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ ప్రజలను తనకు ఓటు వేసి మళ్లీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు బాబ్జి రావు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సత్యనారాయణ, రామారావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు

అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా : బేబినాయన

ప్రజాశక్తి- బొబ్బిలి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయనతో జనసేన నాయకులు గిరడ అప్పలస్వామి, బాబు పాలూరి, టిడిపి పట్టణ అద్యక్షులు ఆర్.శరత్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, జనసైనికులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో 250 కుటుంబాలు చేరిక

రామభద్రపురం మండలం ఆరికతోట, జగన్నాధపురం నుంచి 250 కుటుంబాలు వైసిపిని వీటి టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. వీరంతా కోటకు చేరుకుని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన సమక్షంలో టిడిపిలో చేరారు. అభివృద్ధిలో వైసిపి విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బాబు పాలూరి, రామభద్రపురం మండల నాయకుల ఎం.తిరుపతిరావు, చింతల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **బిసిలకు కొత్తవలస:** రాష్ట్రంలో బిసిలకు పెద్దపేట వేసిన ఘనత టిడిపిదేనని ఎస్ కోట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల


బొబ్బిలి: ప్రచారం చేస్తున్న బేబినాయన

లలిత కుమారి అన్నారు. మండలంలోని రాజపాత్రునిపాలెంలో ఆదివారం టిడిపి జయహో బిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోళ్ల లలిత కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ అధికారం వచ్చిన వెంటనే బిసిలకు న్యాయం జరుగుతుందన్నారు. గత 40 సంవత్సరాలుగా బిసిలు పార్టీకి అండగా ఉంటున్నారని, ఎన్‌టిఆర్ పార్టీని బిసిల కోసమే పెట్టారని గుర్తు చేశారు. అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. చడం జరిగింది. బొబ్బిలి అప్పారావు (మాస్టర్), కోళ్ల శ్రీను, లెంక శ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రేమ, దాతృత్వాలకు ప్రతీక రంజాన్

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రేమ, క్రమశిక్షణ, దాతృత్వం, దైవచింతనల సమ్మేళనమే పవిత్ర రంజాన్ అని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు అన్నారు. ఆదివారం స్థానిక షాదిఖానాలో పవిత్ర రంజాన్ పర్వదిన నేపథ్యంలో హుదా ముస్లిం సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో 150 మంది పేద ముస్లిం కుటుంబాలకు రూ.2.50 లక్షలు విలువ చేసే నిత్యావసర వస్తువులు, రంజాన్ జరుపుకోవటానికి అవసరమైన సరుకులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని హుదా సంస్థ అధ్యక్షులు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హుదా సంస్థ కార్యదర్శి ఇంతియాజ్ అధ్యక్షత వహించగా ముఖ్య అధితిలుగా రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, రోటరీ రీజినల్ కార్యదర్శి తూముల కార్తీక్ హాజరై పేదలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జె సి రాజు మాట్లాడుతూ పేదలకు, బీదవారికి, నిస్సహాయులకు, ఆకలితో ఉన్నవారికి, అనారోగ్యంతో బాధపడే పేదలకు సహాయాన్ని అందించటం గొప్ప మానవీయత లక్షణమని అన్నారు. తూముల కార్తీక్ మాట్లాడుతూ తరతమ భేదాలు లేకుండా, సంతోషంగా ఉండేలా అందరిని ఒకదగ్గరకు చేర్చే వే పండుగలని రంజాన్ పర్వదినం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని నేర్పిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదర్సా ప్రిన్సిపాల్ హాఫిజ్ అబ్దుల్ కలాం, జామియా మసీదు కమిటీ అధ్యక్షులు సయ్యద్ హాజి, హుదా ఉపాధ్యక్షులు అబ్దుల్ హమీద్, కార్యదర్శి ఇంతియాజ్, సభ్యులు జాఫర్, సయ్యద్ బాబ్జి, కలాం , మోరీస్ పాల్గొన్నారు.

బొద్దాంలో నూకాలమ్మ జాతర

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని బొద్దాం గ్రామంలో నూకాలమ్మ జాతర సందర్భంగా గత తొమ్మిది రోజులుగా అమ్మవారి ఘటాలను గ్రామాల్లో ఊరేగిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి గ్రామీణ జానపద కలలో భాగమైన ఓలకాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని కుటుంబాలలో జరిగే చిన్నచిన్న సంఘటనలను సన్నివేశాలుగా మలచి ప్రజలంతా నవ్వుకునేలా భాషను పండించడమే ఓలకాల ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమం గ్రామస్తులను ఆకట్టుకుంది.

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి- మెంటాడ

రాష్ట్రంలో సుభిక్ష పరిపాలన కావాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని జనసేన మండల అధ్యక్షులు సబ్బవరపు రాజశేఖర్ అన్నారు. మండలంలోని జగన్నాధపురం గ్రామంలో జనసేన సభ విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జగన్నాధపురం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు జనసేలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో నలుగురు వార్డు మెంబర్లు, ముగ్గురు వాలంటీర్లు ఉన్నారు. ఈ సందర్భంగా చీపురుపల్లి అచ్చయ్యమ్మ కుమార్తె పైడితల్లి డయాలసిస్ వ్యాధితో చనిపోయినందుకు ఆ కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొట్ట శేఖర్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు టి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు మణిపూర్ అప్పలనాయుడు, జనసేన యువ నాయకులు పాండ్రంకి శ్రీనివాస నాయుడు, అంకవరపు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వాలంటీర్లు, వార్డు సభ్యులతో నాయకులు

పవన్ కల్యాణ్ హత్యకు కుట్ర

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ హత్యకు జగన్ కుట్ర పన్నారని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ విజయనగరం జిల్లా అధ్యక్షులు వబ్బిన సన్యాసినాయుడు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిఠాపురంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మీద బ్లేడ్ బ్యాచ్‌తో విష ప్రయోగం, పవన్ కళ్యాణ్‌ను అంతం చేయడానికి జగన్ కుట్రలో భాగమేనని ఆరోపించారు. రాష్ట్రంలో జగన్ చేసే అవినీతి, అక్రమాలు, దోపిడీ, దాడులు, హత్యలను ప్రశ్నించే ప్రజా నాయకుడు పవన్ కళ్యాణ్ ఒక్కడేనని అందుకే పవన్ కళ్యాణ్‌ను అంతం చేయడానికి ఎన్నికల లోపు వంద కుట్రలు చేయడానికి జగన్ సిద్ధంగా ఉన్నాడని చెప్పారు. పిఠాపురంలో పవన్ మీద దాడులు చేయడానికి కడప నుండి వచ్చిన రౌడీ గ్యాంగ్ కుట్రలను అడ్డుకోవాలని, పవన్ కళ్యాణ్‌కు ఎలాంటి హాని జరిగినా పూర్తి బాధ్యత సిఎం జగన్ వహించాలని సన్యాసినాయుడు హెచ్చరించారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని తుమికాపల్లిలో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ్ హరికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం 42 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాయి లక్ష్మీ కాంప్లెక్స్ అధినేత పీలా సాయిబాబా, వ్యాపారవేత్త లగుడు ఎర్నాయుడు, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, ట్రెజరర్ శ్రావణ్ కుమార్ పాల్గొని సరుకులును అందించారు. వచ్చిన వృద్ధులకు ఎండ తీవ్రంగా ఉండడంతో రైల్వే రిటైర్ ఎంప్లాయ్ రమణ చల్లని పానీయాలు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నగేష్, గోవిందా, అనురాధ, నిర్వాన్, పునర్వికి, తదితరులు పాల్గొన్నారు.